వైఎస్ఆర్

# కడప వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

సోమవారం 08 జూన్ 2026




## సర్ ఓటర్ లిస్ట్ పనులను పరిశీలించిన సబ్ కలెక్టర్

నందలూరు, జూన్ 7 ప్రభాతవార్త :



మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీలో కొనసాగుతున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ ప్రక్రియను రాజంపేట సబ్ కలెక్టర్ భావన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా సవరణ, మ్యాపింగ్ పనుల పురోగతిని పరిశీలించిన ఆమె సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల తాసిల్దార్ సుజాత, సీనియర్ అసిస్టెంట్ అల్లా బకష్, ఆర్ఐ సుశీల్ కుమార్, వీఆర్వోలు పెంచలయ్య, సుబ్బరామయ్య, జగదీష్, శివ, నవీన్‌తో పాటు వీఆర్ఏలు పాల్గొన్నారు.

### యోగా ద్వార మానసిక ప్రశాంతత

## ఆరోగ్య కరమైన జీవితం..

సుండుపల్లి, జూన్ 07,ప్రభాతవార్త :

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమ 7/6/2026 నుండి 21/6/226. తేదీ వరకు నిర్వహించే యోగా కార్యక్రమ యొక్క విశిష్టత, యోగ యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలు కల్పించడంలోనూ,మానసిక ప్రశాంతత పెంపొందించడంలోనూ, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ఆసక్తి కలిగించుటలోనూ ,విద్యార్థుల జ్ఞాపక శక్తిని పెంచుటలోనూ, వారిలో క్రమశిక్షణ పెంపొందించడంలోనూ యోగా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఏం ఇ ఒ 2 రవీందర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి జి రెడ్డి వారి పల్లి నందు ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించడం జరిగిందని, తల్లితండ్రులు పిల్లలకు చదువుతోపాటు యోగ యొక్క ఆవశ్యకతను కూడా పెంపొందించాలని తల్లి దండ్రులకు తెలియజేయడం జరిగిందని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమం లో తల్లి దండ్రులు పిల్లలు పాల్గొన్నారు.

# అంతర్ జిల్లా పశువుల దొంగల ముఠా అరెస్ట్

- రూ.30.65 లక్షల ఆస్తి స్వాధీనం
- 95 పశువులు, బుల్లెట్ బైక్, రూ.10 లక్షల నగదు రికవరీ
- ఆరు మంది నిందితులు అరెస్ట్ - అదుపులో ఒక మైనర్
- పులివెందుల పోలీసుల ప్రత్యేక ఆపరేషన్ విజయవంతం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ సిఐ శ్రీరామ్

పులివెందుల, జూన్ 6 , ప్రభాతవార్త :

జిల్లా వ్యాప్తంగా వరుసగా చోటుచేసుకుంటున్న పశువుల దొంగతనాలపై ప్రత్యేక దృష్టి సారించిన పులివెందుల పోలీసులు భారీ విజయాన్ని సాధించారు. పశువుల దొంగతనాలకు పాల్పడు తున్న అంతర్జిల్లా ముఠాను ఆరు మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి మొత్తం రూ.30.65 లక్షల విలువైన 95 పశువులు, ఒక బుల్లెట్ మోటార్‌సైకిల్, రూ.10 లక్షల నగదు స్వాధీనం చేసుకు న్నట్లు అర్బన్ సీఐ శ్రీరామ్ తెలి పారు. ఆదివారం అర్బన్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టి వివిధ కేసుల్లో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పులివెం దుల, పెండ్లిమర్రి, వేంపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఐదు కేసులను ఛేదించానట్లు పేర్కొ న్నారు. ముఠా సభ్యులు రాత్రి వేళల్లో గ్రామాల పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ పశువులను అప హరించి ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించేవారు అని పలు ఫిర్యాదుల ఆధారంగా దర్యాప్తు చేపట్టి నిందితులను పట్టుకొని విచారించగా దొంగతనాల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని వారి వద్ద నుంచి 95 పశువులను ఒక బుల్లెట్ క్లాసిక్ మోటార్ సైకిల్ ను రూ.10 లక్షల నగదు ను మొత్తం విలువ కలిసి రూ.30.65 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతపురం జిల్లా కేంద్రం సాయి నగర్ కి చెందిన గవిరెడ్డి అలియాస్ ఎరుకల శ్రీరామ్, మామిళ్ల అలియా స్ ఎరుక భాస్కర్,మామిళ్ల అలి యాస్ ఎరుకల చంద్రశేఖర్, ఎం. చిరు అలియాస్ ముండి చిరంజీవి,ఎ. తిరుమల రాజు,షేక్ ఇర్ఫాన్ లను అరెస్ట్ చేయగా గోర్రెడ్డి భారత్ కుమార్ మైనర్ అవ్వడంతో జూ విలీయన్ జైల్ కి తరలించినట్టు తెలిపారు. అనంత పురం కి చెందిన బోడ అలి యాస్ శ్రీను, విజయ్‌లు పరారీ లో ఉన్నట్టు సీఐ తెలిపారు. ఈ కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకపాత్ర పోషించిన డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్ఐలు మరియు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిమోతి, ఏఎస్ఐ వర్మ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన

- ఎస్సై తులసీ నాగప్రసాద్



పెండ్లిమర్రి, జూన్ 7, ప్రభాతవార్త:

జిల్లా పోలీసు యంత్రాంగం మహిళలు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పాఠశాలలు మరియు కళాశాలలు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్లో, ఉద్యోగాలు చేసే కంపెనీలలో, గ్రామాల్లో, కాలనీలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని పెండ్లిమర్రి ఎస్సై తులసీ నాగప్రసాద్ తెలిపారు. శక్తి యాప్ యొక్క ప్రాముఖ్యత మరియు దానిని ఎలా ఉపయోగించాలి అనే దానిపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శక్తియాప్ డౌన్‌లోడ్ చేసే విధానం వివరించి మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు.

### శక్తి యాప్ ఎలా ఉపయోగించాలి

ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నప్పుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చున్నారు. ఎస్ఓఎస్ బటన్, డయల్ 112కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100/112, చైల్డ్‌లైన్ 1098, గృహ హింస 181, మహిళ వేధింపులు 1091, సైబర్ నేరాల టోల్ ఫ్రీ 1930, సైబర్ మిత్ర, ప్రతి మహిళా, బాలిక తమ భద్రత కోసం ప్రభుత్వం కల్పించిన చట్టాలను తెలుసుకోవడం ఎంత ముఖ్యమో వివరించి వారిని చైతన్యవంతులను చేశారు.

# అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణంలో కీలక ముందడుగు

**ఇక అన్నమయ్య నీటి విడుదల కెపాసిటీ 4.75 లక్షల క్యూసెక్కులు**

**నీటి విడుదల సామర్థం ఖరారు చేసిన టిఇసి**

**సిఇ సిడిఓ చేతిలో తుది ఆకృతులు**

రాజంపేట, జూన్ 7 ప్రభాతవార్త



అన్నమయ్య పునర్నిర్మానంలో కీలకమైన ముందడుగు పడింది. మూడేళ్లుగా అధ్యయనంలోనే ఉన్న ప్రాజెక్టు నీటి విడుదల సామర్థం నిర్ణయం ఎట్టకేలకు ఖరారైంది. నీటి విడుదల సామర్థం పై చెన్నై ఐఐటి నిపుణులు నివేదిక తర్వాత సీడబ్ల్యూసి అధికారులతో పలుమార్లు చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టెక్నికల్ ఎక్స్పర్ట్ కమిటీ డిశ్చార్జి పై నిర్ణయం తీసుకుంది. అన్నమయ్య ప్రాజెక్టు నీటి విడుదల సామర్థం 4.75 లక్షల క్యూ సెక్కులుగా ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. రెండు నెలల క్రితం చెన్నై ఐఐటి నిపుణులు గత 20 సంవత్సరాలలో వాతావరణ శాఖ గణాంకాలు విశ్లేషణ తర్వాత, ప్రాజెక్టుకు ఇప్పటివరకు వచ్చిన వరదలు అధ్యయనం చేసిన తర్వాత నీటి విడుదల సామర్థం4.11 లక్షల క్యూసెక్కులుగా నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత అధికారులు వేర్వేరు విధానాలలో అధ్యయనం చేశారు. పూణేలోని సిడబ్ల్యూసి అధికారులతో చర్చించారు. చర్చల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన టెక్నికల్ కమిటీ డైరెక్టర్ రమేష్ కుమార్, సిఈ సిడిఓ తిరుమలరావు, జియాలజీ నిపుణుడు ఎం రాజు, కడప చీఫ్ ఇంజనీర్ రవికిరణ్ సమావేశమై ప్రాజెక్ట్ నీటి విడుదల సామర్థం 4.75 లక్షలు గా నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు జలవనరుల శాఖ రాష్ట్ర సలహాదారుడు వెంకటేశ్వరులకు నివేదిక పంపారు. ఇది ఇలా ఉండగా అన్నమయ్య ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థం 2.242 టీఎంసీలుగా, నీటి విడుదల సామర్థం 1.80 లక్షల క్యూసెక్కులుగా డిజైన్ చేశారు. ఇప్పటికే పలుమార్లు 1.80 లక్షల కంటే ఎక్కువగా ప్రాజెక్టుకు వరద వచ్చింది. 2021 వరదల్లో ఇప్పటివరకు ప్రాజెక్టుకు వచ్చిన వరదల కంటే అతి ఎక్కువగా వరద వచ్చిందని అధికారుల అంచనా .అందుకు కారణం అన్నమయ్య ప్రాజెక్టుకు పై భాగంలో ఉన్న పింఛా ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోవడం ప్రధాన కారణం. ఈ మహా విలయం సందర్భంగా ప్రాజెక్టుకు ఎంత ఫ్లడ్ వచ్చిందనేది నమోదు కాలేదు. ఏది ఏమైనా ఆలస్యంగా నైనా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించిన డిజైన్ ఖరారు చేయాల్సి ఉంది .ఇప్పటికే సిఈ సీడీవో వద్ద పలు ఆకృతులు పరిశీలనలో ఉన్నాయి. 8.233 లక్షల క్యూసెక్కులనీటి విడుదల సామర్థం అయినప్పుడు మొత్తం 16 గేట్లు, రెండు స్పిల్వేలు, కాంక్రీట్ డామ్ నిర్మించాలని డిజైన్ చేశారు. ఈ మేరకు అప్పట్లో ఈ డిజైన్ ప్రకారం 787 కోట్ల తో టెండర్లు పిలిచారు. అయితే నిపుణుల కమిటీ ప్రాజెక్టు పరిశీలించిన తర్వాత కాంక్రీట్ డామ్ నిర్మాణాన్ని పక్కన పెట్టారు. కోర్ వాల్ పద్ధతిలో నిర్మించాలని సిఫారసు చేశారు. అలాగే ఎర్త్ రాక్ ఫిల్ డ్యామ్ పద్ధతిలో కూడాకూడా పరిశీలనలో ఉంది .అయితే తాజాగా 4.75 లక్షల నీటి విడుదల సామర్థం ఖరారైన నేపథ్యంలో తుది ఆకృతి ఏ పద్ధతిలో ఖరారు చేస్తారో తేలాల్సి ఉంది. ఈ మేరకు అంచనాలు సిద్ధం చేసే అవకాశం ఉంది. తుది ఆకృతులు ఖరారైన తర్వాత డిపిఆర్ సిద్ధం చేసే అవకాశం ఉంది. గత నెలలోనే అన్నమయ్య ప్రాజెక్టు పుణ్య నిర్మాణానికి రాయలసీమ హార్ట్ హార్టికల్చర్ హబ్ కింద నిర్మించేందుకు నివేదిక సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు.

### ఇందిరమ్మ కాలనీలో

# నాగేంద్ర బాబు హత్య



మైదుకూరు, జూన్ 07, ప్రభాతవార్త:

కడప జిల్లా మైదుకూరు పట్టణ మున్సిపాలిటీ వనిపెంట రోడ్డు ఇందిరమ్మ కాలనీ నందు రహదారి పక్కన అరుగు బండపై శనివారం రాత్రి నిద్రిస్తున్న నాగేంద్ర బాబు అనే వ్యక్తిని అతి కిరాతకంగా హత్య చేయడం జరిగింది. వివరాల్లో కెళితే ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న నాగేంద్ర బాబు అలియాస్ (షకీలా) రాత్రి మద్యం సేవించిన మత్తులో వ్యక్తితో ఘర్షణ జరగడంతో మనసులో పెట్టుకున్న వ్యక్తి ఇంటికెళ్లి పొద్దుపోయిన తర్వాత ఆయుధంతో వచి ముఖంపై బలమైన గాయాలు చేసి హత్య చేసినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సీరియస్‌గా తీసుకోవడంతో ముద్దాయిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

### గంజాయికి బానిసై ప్రతిరోజు ఘర్షణలు,

ఇందిరమ్మ కాలనీ లో నివాసం ఉంటున్న కొంతమంది మద్యం,గంజాయికి బానిసై రాత్రి సమయంలో అనేక కుటుంబాలను ఇబ్బందులు పెడుతూ రాముల వారి గుడి ఆవరణ పరిసర ప్రాంతాల్లో రాత్రి సమయాలలో యువత విచ్చలవిడిగా మద్యం,గంజాయి సేవిస్తూ మత్తులో ఉంటారని స్థానికుల సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకొని తెలుగంగ కాలనీలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, మహిళల విద్యాలయం, తహసిల్దార్ కార్యాలయం ఉన్న ఈ పరిసర ప్రాంతంలో రాత్రి సమయంలో సీసీ కెమెరాలతో నిగా పెట్టి, పోలీసులు నిగా ఉంచాలని లేకపోతే యువత రెచ్చిపోయి అనేక సమస్యలు జరగవచ్చని స్థానికులు తెలియజేశారు.

### ప్రమాదవశాత్తు నీటిలో మునిగి

# వ్యక్తి మృతి, మరొకరు గల్లంతు

జమ్మలమడుగు, జూన్ 7, ప్రభాతవార్త:



మైలవరం మండలం వేపరాల గ్రామం సమీపంలోని పెన్నానది లో ఆదివారం విషాద ఘటన చోటు చేసుకుంది. తొర్రివేముల గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు సరదాగా స్నానానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు కల్యాణ్‌కుమార్(25) అతని అత్త వరస వవెంగమ్మ(45) నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న స్థానికులు, అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. గాలింపుల్లో కల్యాణ్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీయగా వెంగమ్మ కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం

వేంపల్లె: జూన్ 07 ప్రభాతవార్త



మహిళలు, బాలికల భద్రతకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన 'శక్తి' యాప్‌ను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వేంపల్లె సి.ఐ నరసింహులు సూచించారు. జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు వేంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 3వ పేజీలో

## బూతు స్థాయి నుంచి భాజపాను బలోపేతం చేయాలి

వేంపల్లి జూన్ 07 ప్రభాతవార్త



బూతు స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వివిఎన్ మాధవ్ తెలిపారు వేంపల్లిలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మన ఊరు మన జెండా కార్యక్రమానికి మంత్రి సత్య కుమార్ యాదవ్ జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిలతో పార్టీ జెండాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిన భాజపాను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని అ న్నారు అంత్యోదయ స్ఫూర్తిగా పనిచేస్తున్న పార్టీ యొక్క విధివిధానాలను ప్రతి ఒక్క బూతులో సమావేశం పెట్టి వివరించే కార్యక్రమం చేపట్టాలని అన్నారు.

పేదల సంక్షేమమే ద్యేయంగా ప్రధా ని నరేంద్ర మోడీ పనిచేస్తున్నారని చెప్పారు. సబ్‌కా సబ్ కా వికాస్ లక్ష్యలను ప్రతి ఒక్కరికి చేరాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత ఎర్రబోయిన రవి యాదవ్ సురేష్ దశరథ శివకృష్ణ, జనసేన పులివెందుల ఇంచార్జి హరీష్ రవిశంకర్ రౌతు నాగేంద్ర పెద్దఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

### పశువుల దొంగతనాల కేసులో

# 'బిగ్ బాస్' ఎవరు?

**ప్రధాన సూత్రధారిని వదిలేసారా..?** **నిందితుల ఎంపికపై అనుమానాలు**

**లక్షల రూపాయలు చేతులు మారాయనే ప్రచారం**

పులివెందుల జూన్ 7, ప్రభాత వార్త :




ఇటీవల వెలుగులోకి వచ్చిన పశువుల దొంగతనాల కేసు కొత్త మలుపులు తిరుగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి పశువులను అక్రమంగా తరలించి, వాటిని పక్క రాష్ట్రంలోని బెంగళూరు మార్కెట్లకు చేర్చి క్రయవిక్రయాలు నిర్వహించడం ద్వారా ఈ ముఠా లక్షల రూపాయలు సంపాదిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ కేసులో పోలీసులు కొంతమంది నిందితులను మాత్రమే అదుపులోకి తీసుకుని, మరికొంతమందిని వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికంగా ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం, ఈ వ్యవహారానికి ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న వ్యక్తి బెంగళూరులో ఉంటాడని, అతడే పశువుల కొనుగోళ్లు, విక్రయాలకు కీలకంగా వ్యవహరిస్తున్నాడని చెబుతున్నారు. అయినప్పటికీ ఆ 'బిగ్ బాస్'ను పోలీసులు ఇప్పటివరకు అరెస్ట్ చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇక దొంగతనాల్లో 20 మందికి పైగా పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, కేవలం ఎనిమిది మందిపైనే కేసులు నమోదు చేసి మిగిలిన వారిని పరిగణనలోకి తీసుకోలేదని విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. ఈ వ్యవహారంలో అనంతపురానికి చెందిన బేగం మహిళ, తాను మానవ హక్కుల కార్యకర్తనని చెప్పుకుంటూ కొందరి తరఫున జోక్యం చేసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై 93!!013!!101 నెంబర్ కి ఉన్నత అధికారులు కాల్ డేటా తీస్తే పోలీస్ అధికారికి మధ్య జరిగిన రాయబారాల గురించి బట్ట బయలు అవుతుంది అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అలాగే కేసులో కొంతమంది నిందితులను తప్పించేందుకు లక్షల రూపాయలు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తును పారదర్శకంగా నిర్వహించి, అసలు సూత్రధారులతో పాటు సంబంధిత వారందరినీ చట్టం ముందు నిలబెట్టాలని ప్రజలు కోరుతున్నారు. పశువుల దొంగతనాల కేసులో వినిపిస్తున్న ఆరోపణలు, ప్రచారాలపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కేసు దర్యాప్తు పూర్తయితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని వారు అంటున్నారు.

# గుణకనపల్లిలో భూగర్భ జలాల రీఛార్జ్ ప్రాజెక్ట్ ప్రారంభం

**రూ.15 లక్షలతో 5 రీఛార్జ్ బోర్లు - రైతులకు నీటి భరోసా - ఎంపీ అవినాష్ రెడ్డి**



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



ప్రాజెక్టును ప్రారంభిస్తున్న ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి

పులివెందుల, జూన్ 7, ప్రభాతవార్త :

పులివెందుల నియోజకవ ర్గంలోని లింగాల మండలం గుణకనపల్లి గ్రామంలో భూగర్భ జలాల సంరక్షణకు దోహదపడే సరికొత్త రీఛార్జ్ బోర్‌వెల్స్ ప్రాజెక్టును ఆదివారం కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రూ.5 కోట్ల వ్యయంతో పంప్‌హౌస్, మోటార్ల ఏర్పాటు, పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. అయితే భూసేకరణ సమస్యల కారణంగా చెరువు తవ్వకం నిలిచిపోవడంతో, ఇప్పటికే చేసిన పెట్టుబడులు వృథా కాకుండా నీటిని నేరుగా భూగర్భంలోకి పంపే విధంగా రీఛార్జ్ బోర్‌వెల్స్ ప్రణాళికను రూపొందించినట్లు వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.15 లక్షల వ్యయంతో ఐదు రీఛార్జ్ బోర్‌వెల్స్‌తో పాటు 100 మీటర్ల మేర పైప్‌లైన్ విస్తరణ పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్ట్ ప్రారంభిం చిన రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిసర ప్రాంతా ల్లోని బోరుబావుల్లో నీటి మట్టం పెరగడం విశేషమని, దీనిపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపా రు. నీరు ఆవిరైపోకుండా నేరుగా భూగర్భంలో నిల్వ అయ్యే విధంగా రూపొందించి న ఈ ప్రాజెక్టు రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన కేస్ స్టడీగా నిలుస్తుందని అభిప్రాయ పడ్డారు. ఇరిగేషన్ అధికారుల అంచనా ప్రకారం, పాపాగ్ని- చిత్రావతి నదుల మధ్య భూగర్భంలో సుమారు 120 టీఎంసీల నీటిని ఈ తరహా విధానాల ద్వారా నిల్వ చేసే అవకాశం ఉందని వెల్లడించారు. గుణకనపల్లి నుంచి రాముట్లపల్లి వరకు విస్తరించిన అరటి తోటలు, ఇతర వ్యవసాయ పంటలకు ఈ ప్రాజెక్టు ద్వారా గణనీయ మైన ప్రయోజనం చేకూర నుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దుర్గమ్మ ఆలయంలో భాగవత సప్తాహం



వేంపల్లి జూన్ 07 ప్రభాతవార్త

వేంపల్లె పట్టణంలోని శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నుండి భాగవత సప్తాహం ప్రారంభించినట్లు పులివెందుల భాగవత భక్త సమాజం అధ్యక్షులు చిన్న శివారెడ్డి తెలిపారు. ఈ నెల 7వ తేది నుండి 13వ తేదీ వరకు భాగవత సప్తాహం (భగవద్గీత పారాయణం) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పులివెందుల భాగవత భక్త సమాజం అధ్యక్షులు చిన్న శివారెడ్డి,ఉపాధ్యక్షులు పాపిరెడ్డి మాట్లాడుతూ వేంపల్లె దుర్గమ్మ ఆలయంలో భాగవత సప్తాహం వ్యవస్థాపకులు రవికుమార్ రెడ్డి కోరగా 7రోజుల పాటు భాగవత సప్తాహం నిర్వహిస్తున్నామన్నారు. భగవత సప్తాహంలో పాల్గొనడం వల్ల సమస్త పాపాలు తొలగిపోయి, మనశ్శాంతి,భక్తి జ్ఞానాలు కలుగుతాయని తెలిపారు. కావున వేంపల్లె మండల ప్రజలు ఈ భాగవత సప్తాహంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి

బద్వేల్, జూన్ 7, ప్రభాతవార్త



ద్రవ్యోల్బణం పేరుతో గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను వరుసగా పెంచుతూ సామాన్య ప్రజలపై భారాన్ని మోపడం దుర్మార్గమని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు సంగటి చంద్రశేఖర్ విమర్శించారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మరోసారి వంటగ్యాస్ ధరలు పెంచడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరను పెంచడంతో ఢిల్లీలో సిలిండర్ ధర రూ.913 నుంచి రూ.942కు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.965 నుంచి రూ.994కు చేరుకుందని పేర్కొన్నారు. గత మూడు నెలల వ్యవధిలో గ్యాస్ ధరలు రెండుసార్లు పెరగడం ఆందోళనకరమని అన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా వరుసగా పెరుగుతున్నాయని, పెట్రోల్ ధర రూ.117.61కు, డీజిల్ ధర రూ.104.41కు చేరడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. చమురు కంపెనీలు ఇష్టారీతిన ధరలు పెంచుతూ ప్రజలపై అదనపు భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. గత మూడు నెలల్లో గ్యాస్ ధరలు రూ.100కు పైగా, పెట్రోల్, డీజిల్ ధరలు రూ.15 నుంచి రూ.20 వరకు పెరగడం వల్ల సామాన్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చంద్రశేఖర్ తెలిపారు. ధరల పెంపుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఆయిల్ కంపెనీలపై ఒత్తిడి తీసుకువచ్చి పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పష్టమైన వైఖరి ప్రకటించాలని ఆయన కోరారు.

## ఆత్మీయ సమావేశానికి తరలిన నాయకులు



సిద్ధవటం జూన్ 7 ప్రభాతవార్త

బలిజ ఆత్మీయ సమావేశానికి సిద్ధవటం మండలాలు చెందిన బలిజ ప్రముఖులు తరలి వెళ్లారు. ఈ రెండు మండలాల నుంచి ఆరు వాహనాలలో పలు గ్రామాలకు చెందిన బలిజ ప్రముఖులు పాల్గొన్నారు. బలిజల ఆత్మగౌరావానికి ప్రతిష్టను దెబ్బతీసేలా అనేక సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో రాజంపేటలో నేడు జరుగుతున్న సమావేశానికి ఒక ప్రాముఖ్యత ఏర్పడిందని, రాజంపేట పార్లమెంట్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్త రామచంద్రయ్య, రాష్ట్ర వాణిజ్య సెల్ ఎన్నారై విభాగం మాజీ కార్యదర్శి చలపాటి చంద్ర, అలాగే ఒంటిమిట్ట మండల టిడిపి సీనియర్ బలిజ నాయకులు మామిళ్ళ ఈశ్వరయ్య, రాజంపేట పార్లమెంట్ పార్టీ మాజీ కార్యనిర్వః కార్యదర్శి మోదుగుల నరసింహులు, పామూరు సుబ్రహ్మణ్యం, డాక్టర్ పసు వులేటి కృష్ణ పెద్దకొత్తపల్లి చిన్న కొత్తపల్లి గ్రామాల చెందిన బలిజ ప్రముఖ నాయకులు కొత్తపల్లి మురళీమోహన్ పలుకూరు దత్తాత్రేయ తదితరుల ఆధ్వర్యంలో నాయకులు తరలి వెళ్లడం జరిగింది. మొదటి నుంచి పార్టీలో ఉంటున్న తమకు తగిన ప్రాధాన్యత లభించడం లేదని వాటికి ఎన్ని మార్లు చెప్పిన ఫలితం లేదని కనుకనే ఆందోళన బాట పట్టడం జరిగిందని రామచంద్రయ్య మామిళ్ళ ఈశ్వరయ్య తెలిపారు. ఈరోజు కార్యక్రమంలో జరిగే విశేషాలు తెలియాల్సి ఉంది.

## మంత్రిను సత్కరించిన జనసేనపార్టీ ఇంచార్జ్



వేంపల్లి జూన్ :07 ప్రభాతవార్త

రాష్ట్ర ఆరోగ్య వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ను జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డాక్టర్ హరీష్ ఘనంగా సత్కరించారు. బిజెపి నిర్మాణ వ్యవస్థాపకుడు మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్పేయి విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ సందర్భంగా పులివెందుల పర్యటనకు వస్తున్న మంత్రి సత్య కుమార్ యాదవ్ను వేంపల్లి పులివెందుల రోడ్డులో గల ఎన్టీఆర్ సర్కిల్ నందు శాలువాతో జనసేన పార్టీ పులివెందుల ఇంచార్జ్ డా. హరీష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గోసుల ఆంజనేయులు, పెదబల్లి సుధీర్ రెడ్డి,దేవా,శ్యామ్, మల్లేష్,నాగేంద్ర,జయచంద్ర, నంద,అంజి, శివ తదితర జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరువుల మరమ్మతులకు
# 50 లక్షలు మంజూరు

దువ్వూరు, జూలై 07, ప్రభాతవార్త:

మండల పరిధిలోని చింతకుంట, దువ్వూరు చెరువుల మరమ్మతులకు గాను జలధార జీవనధార పథకం కింద 50 లక్షల రూపాయల మేర నిధులు మంజూరైనట్లు సంబంధిత అధికారి ఏఈ రామ్మోహన్ తెలిపారు. దువ్వూరు చెరువులో తూము మరమ్మతులకు అలాగే అలుగు నిర్మాణానికి, చెరువు చుట్టూ కంచె వేయుటకు గాను 14 లక్షల రూపాయలు మంజూరు చేశారు అన్నారు. అలాగే వంకలో మట్టిని తొలగించేందుకు కూడా ఏర్పాటు చేశారన్నారు. చింతకుంట చెరువులో వివిధ రకాల పనులకు 10 లక్షల 50 వేల రూపాయలు అలాగే గుడిపాడు, రామాపురం, దాసరి పల్లె గ్రామాల్లో మరమ్మతులకు నోచుకోని చెక్ డ్యామ్ లను తిరిగి మరమ్మత్తులు చేసేందుకు గాను 26 లక్షల రూపాయలు కేటాయించారు అన్నారు. ఈ నిధులను జూన్ ఆఖరులోగా పూర్తిచేయాలని ఆదేశించారని పేర్కొన్నారు. ఈ పనులన్నీ ఆయా చెరువు నీటి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## బద్వేల్‌లో డీఎస్పీ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఏర్పాటు చేయాలి

బద్వేల్, జూన్ 7, ప్రభాతవార్త :

వేగంగా అభివృద్ధి చెందుతున్న బద్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని, దీనికి శాశ్వత పరిష్కారంగా డీఎస్పీ కార్యాలయం మరియు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక భగత్‌సింగ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు సంగటి చంద్రశేఖర్ మాట్లాడారు. బద్వేల్ పట్టణ జనాభా లక్షకు పైగా పెరగడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చిందని, వాహనదారులు మరియు ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జకరయ్య మాట్లాడుతూ, అగ్రహారం నుంచి మార్కెట్ యార్డ్ వరకు, మడకలవారిపల్లె నుంచి చెన్నంపల్లి వరకు ప్రయాణించడానికి అరగంటకుపైగా సమయం పడుతోందన్నారు. ట్రాఫిక్ సమస్య కారణంగా అత్యవసర సేవలకు చెందిన 108 అంబులెన్సులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బద్వేల్‌లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసి, ట్రాఫిక్ సీఐ, ఎస్సైతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించాలని, డీఎస్పీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. నూతన మున్సిపల్ కార్యాలయం సమీపంలోని టిడ్కో గృహాల కోసం కేటాయించిన స్థలం, అలాగే తెలుగంగ కాలనీలోని ప్రభుత్వ భూములను ఈ కార్యాలయాల నిర్మాణానికి పరిశీలించాలని సూచించారు.




## ప్రభుత్వ వసతి గృహాల్లో ముందుస్తుగా దోమల నివారణ చర్యలు

రాజంపేట, జూన్ 7 ప్రభాతవార్త

మలేరియా మాసోత్సావాన్ని పురస్కరించుకొని మలేరియా నివారణకు ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టారు. ఆదివారం రాజంపేట పట్టణము లోని ట్రైబల్ బాలికల కాలేజ్ హాస్టల్, ఎస్,సి బాలికల కాలేజ్ హాస్టల్, బి. సి కాలేజ్ బాలుర హాస్టల్ మరియు సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల వసతి గృహాల లో పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం దోమల నివారణ కొరకు ,జిల్లా మలేరియా అధికారి డాక్టర్ అరిపుల్ల ఆదేశాల మేరకు మలేరియా, డెంగు చికున్ గున్యా, మెదడు వాపు జ్వరం,రాకుండా (ఎసిమ్) ఆల్ఫా సైఫర్ మైత్రిన్ రసాయనాన్ని పిచికారి చేస్తున్నట్లు, మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్. ఎస్. దాస్ తెలిపారు,ఈ రసాయనాన్ని గోడలకు పిచికారి చేయడం వలన దోమలు గోడల మీద వాలిన వెంటనే చనిపోతాయని, ఈ రసాయనం కొన్ని వారాలు పాటు పని చేస్తుందని తెలియచేశారు. అలాగే వసతి గ్రహము చుట్టూ పరిసరాలు పరిశుభ్రముగా ఉంచుకోవాలని,వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమం లో వార్డెన్ రాజశేఖరరాజు, హెల్త్ అసిస్టెంట్స్ సుబ్బయ్య, శివకుమార్ రాజు, శివరామ్, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



దోమలు నివారణకు మందు పిచికారి చేస్తున్న వైద్య సిబ్బంది

## టిడిపి పాలనలోనే గృహ నిర్మాణ శాఖ ఐరన్ మటుమాయం

### ఎమ్మెల్యే వరద దీనిపై ప్రజలకు సమాధానం చెప్పాలి

### మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి డిమాండ్

ప్రొద్దుటూరు జూన్ 7 ప్రభాతవార్త

గత వైసిపి పాలనలో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇల్లు లేని నిరుపేదలకు గృహాలు నిర్మించే క్రమంలో ప్రభుత్వం నుండి వచ్చిన 268 టన్నులు ఐరన్ టిడిపి పాలనలోనే మటుమాయమైనట్టు గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులు నిర్ధారించారని దీనిపై స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజు రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వన్‌టౌన్ సర్కిల్‌లోని వైసీపీ నాయకుడు ఫరీద్ బాషా కార్యాలయంలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిపై పలు ప్రశ్నలు సంధించారు. హౌసింగ్ గోడౌన్‌లో దాదాపు రూ.1.75 కోట్ల విలువైన 268 టన్నుల ఇనుము కడ్డీలు మాయమైన అంశంపై ఎమ్మెల్యే ఇటీవల విలేఖరుల సమావేశం నిర్వహించి వైసీపీ నాయకులపై ఆరోపణలు చేశారని, అయితే శనివారం విజయవాడ నుంచి వచ్చిన ఉన్నతాధికారులు, కడప పీడీ తనిఖీలు నిర్వహించి ఇనుము మాయం అయిన విషయం నిజమేనని, ఆ ఘటన 2025 సెప్టెంబర్ 5 తర్వాత జరిగిందని నిర్ధారించారని వివరించారు. ఈ వ్యవహారం జరిగిన సమయం నుండి సంబంధిత అధికారి విధుల్లో ఉన్నారని, ఆయన గత ఎనిమిది నెలలుగా ప్రతిరోజూ ఎమ్మెల్యేను కలుస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ అధికారి కార్యాలయంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చిత్రాలతో పాటు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఫొటో కూడా ఉందని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇనుము మాయం వ్యవహారం ఎమ్మెల్యేకు తెలియకుండా జరిగిందా అనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని అన్నారు. మాయమైన ఇనుము ఎమ్మెల్యే తనయుడు నంద్యాల కొండారెడ్డి నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతాలకు తరలించి ఉండవచ్చునే అనుమానాలు ఉన్నాయని పేర్కొంటూ, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. జగనన్న కాలనీల భూసేకరణ విషయంలో కూడా తమపై ఎకరాకు రూ.10 లక్షలు వసూలు చేశారంటూ ఎమ్మెల్యే ఆరోపణలు చేశారని, వాటిని నిరూపించాలని సవాల్ విసిరారు. తాము అక్రమాలకు పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. అలాగే జగనన్న కాలనీలకు సంబంధించి 23 వేల మంది లబ్ధిదారులు లేరని, ఓటర్ల జాబితా ఆధారంగా పేర్లు నమోదు చేశారంటూ చేస్తున్న ఆరోపణలను కూడా ఖండించారు. ఆ ఆరోపణలను గతంలో తమ పార్టీ తరఫున గెలిచి ప్రస్తుతం టిడిపిలో చేరిన కౌన్సిలర్లతో ఆ విషయాలను చెప్పించాలని సూచించారు. వాస్తవాలు ఏవైనా చివరకు ప్రజల ముందుకు వస్తాయని, హౌసింగ్ గోడౌన్ ఇనుము మాయం వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిగితే నిజాలు బయటపడతాయని అన్నారు.




## పద్మశాలీల సమస్యల పరిష్కారం కోసమే జాతీయ పద్మశాలీయ సంఘం ఏర్పాటు

### రాష్ట్ర పద్మశాలీయ సంఘం అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు





ప్రొద్దుటూరు జూన్ 7 ప్రభాతవార్త

పద్మశాలీయ కుల బాంధవుల రాజ్యాధికారం, వారి సమస్యల పరిష్కారం కోసమే ఢిల్లీ కేంద్రంగా జాతీయ పద్మశాలీయ సంఘం ఏర్పాటు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారపు శ్రీనివాసరావు వెల్లడించారు. ఆదివారం స్థానిక జమ్మలమడుగు రోడ్డు లోని హర్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాలువ విజయ నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేనేత వర్గ అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ కార్యక్రమాలపై కీలక అంశాలు చర్చించబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగ్గారావు శ్రీనివాసరావు మాట్లాడుతూ చేనేత వర్గానికి రాజకీయ చైతన్యం అవసరమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రతి నియోజకవర్గంలో పద్మశాలి భవన్ ఏర్పాటు చేయడంతో పాటు, పద్మశాలి జనాభా అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఎమ్మెల్యే టికెట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే భృగుమహర్షి, మార్కండేయ మహర్షి మఠాల స్థాపనతో పాటు వివిధ రాష్ట్రాల సంఘాలను ఏకం చేసి ఆల్ ఇండియా పద్మశాలి సంఘం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రెండు నెలల తర్వాత ఢిల్లీలో జాతీయ అధ్యక్ష పదవి ఎన్నికలతో కూడిన సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో సంఘ కార్యకలాపాలు జాతీయ స్థాయిలో ఢిల్లీ కేంద్రంగా కొనసాగనున్నాయని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కాల్వ విజయనాగేంద్ర మాట్లాడుతూ చేనేత కార్మికుల కోసం రాయితీతో కూడిన వైద్య సేవలు తమ హర్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. సర్జికల్, ఆర్థోపెడిక్స్, డెంటల్ సహా పలు విభాగాల్లో 30 నుండి 40 శాతం రాయితీతో చికిత్సలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు చేనేత కార్మికులకు 40 మందికి హెల్త్ రాయితీ కార్డులు పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. కృష్ణా జిల్లా అధ్యక్షుడు బట్టు శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలన్నింటి నుండి పెద్ద సంఖ్యలో పద్మశాలి కులబాంధవులు సమావేశానికి హాజరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులకు హెల్త్ కార్డులు ఏర్పాటు చేసి పంపిణీ చేసిన డాక్టర్ కాలువ విజయ నాగేంద్రను అభినందించారు. అనంతరం ఆయనను సంఘ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం ప్రతినిధులు డాక్టర్ సమిత, శిలివేరు దశరథ రామయ్య, శింగరి వెంకటేశ్వర్లు, రుద్ర మహేశ్వరుడు, సామల వెంకట సుబ్బయ్య, గుర్రం వెంకటస్వామి, జక్కా లక్ష్మీనారాయణ, ఛత్తీస్ గడ్ అధ్యక్షులు గోపాల్, కర్నాటక రాష్ట్ర జనరల్ సెక్రటరీ విజయ కుమార్, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి పద్మశాలి నాయకులు, కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రపంచ సైకిల్ దినోత్సవంపై ర్యాలీ

### అసిస్టెంట్ కమాండెంట్ డి ప్రసాద్

సిద్ధవటం జూన్ 7 ప్రభాతవార్త

సిద్ధవటం మండలంలోని భాకరాపేట సమీపాన ఏపీఎస్పీ 11 వ పోలీసు పటాలయంలో కమాండెంట్ ఆనంద్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం ప్రపంచ సైకిల్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండర్ డి ప్రసాద్ మాట్లాడుతూ శారీరిక ధ్రులత్వం, పర్యావరణ సుస్థిరత ఆరోగ్యపరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకే పోలీస్ పటాలయంలో ప్రత్యేక సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించామని క్రమం తప్పని శారీరిక శ్రమ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సైకిల్ తొక్కడం వల్ల, గుండె ఊపిరితిత్తులు బలపడతాయని శిరీరంలోని అదనపు కొవ్వు వంటి పదార్థాలు కరిగిపోయి శరీరపు బరువు అదుపులో ఉంటుందని ఒత్తిడి, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.



## మోడీది వాతల ప్రభుత్వం. చంద్రబాబుది కూతల ప్రభుత్వం

వేంపల్లి: జూన్ 07 ప్రభాతవార్త

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం వాతల ప్రభుత్వం కాగా రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కూతల ప్రభుత్వంగా తయారైందని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. ఆదివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గృహ వినియోగ వంటగ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం మళ్ళీ పెంచడం శోచనీయమన్నారు. ఈ ఏడాది మార్చి 7వ తేదీన ఒక్కొక్క సిలిండర్ పై 60 రూపాయలు ధర పెంచడం జరిగింది. ఈరోజు నుంచి మళ్లీ 29 రూపాయలు పెంచడం దుర్మార్గం. గృహిణులు వంటగదిలేక పోవాలి అంటే భయపడిపోతున్నారు. కమర్షియల్ గ్యాస్ ధర ఇటీవలే నాలుగుసార్లు పెంచారు. ఈ ఏడాది మార్చిలో ఒక్కొక్క సిలిండర్ పై 144 రూపాయలు,ఏప్రిల్ లో 200 రూపాయలు, మేలో ఒకేసారి 993 రూపాయలు జూన్లో 53 రూపాయలు పెంచడం జరిగింది . దీనివలన హోటల్లు, రెస్టారెంట్లు, బేకరీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. సీఎన్జీ ధర కిలో పై నాలుగు రూపాయలు పెంచడం అయింది దీనివలన ఆటోలు, టాక్సీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యాయి. పెట్రోలు,డీజిల్ ధరలను ఇటీవలనే నాలుగు సార్లు పెంచడం జరిగింది. కాంగ్రెస్ హయాంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు 2008లో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచములు ధర బ్యారెల్ కు 147 దాలర్లుగా ఉన్నప్పుడు భారతదేశంలో లీటర్ పెట్రోల్ 50 రూపాయలకు, లీటర్ డీజిల్ 34 రూపాయలకు,వంట గ్యాస్ సిలిండర్ 400 రూపాయలకు సరఫరా చేయడం జరిగింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర బ్యారెల్ కు 95 డాలర్లు మాత్రమే ఉంది.అలాంటప్పుడు పెట్రోలు,డీజలు, వంట గ్యాస్,కమర్షియల్ గ్యాస్, సిఎన్జి ధరలు పెంచడం ప్రభుత్వ అసమర్థతకు ప్రభుత్వ దోపిడీ విధానానికి నిదర్శనమని తులసి రెడ్డి అన్నారు. చంద్రబాబుది కూతల ప్రభుత్వం. రాయలసీమను పారిశ్రామికంగా,వాణిజ్యపరంగా దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యం అని చంద్రబాబు ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదం. అమ్మకు అన్నం పెట్టని ప్రబుద్ధుడు పిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తా అన్నట్టుంది చంద్రబాబు ప్రభుత్వ వాలకం. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము రాష్ట్ర విభజన జరిగిన ఆరు నెలల లోపల రాయలసీమలోని కడప జిల్లాలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో సమీకృత ఉక్కు కర్మాగారం నిర్మించాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కావలసిన అన్ని హంగులు కడప జిల్లాలో ఉన్నాయి.కానీ 12 సంవత్సరాలైనా అతీగతీలేదు. రాయలసీమ సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని గత కాంగ్రెస్ ప్రభుత్వం 2008, 09లో కడప రాయచోటి మదనపల్లి బెంగళూరు నూతన బ్రాడ్ గేజ్ రైల్వే మార్గాన్ని మంజూరు చేసింది. కడప నుంచి పెండ్లిమర్రి వరకు రైల్వే లైన్ పూర్తి అయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయని కారణంగా పనులు నిలిచిపోయాయి. రాయలసీమను పారిశ్రామికంగా వాణిజ్యపరంగా అభివృద్ధి చేయాలన్న చిత్తశుద్ధి చంద్ర బాబు ప్రభుత్వానికి ఉంటే వెంటనే కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెట్టాలని, మధ్యలో ఆగిపోయిన కడప రాయచోటి మదనపల్లి బెంగళూరు బ్రాడ్ గేజ్ రైల్వే పనులను పునః ప్రారంభించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె విజయభాస్కర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సెంట్రల్ కిచెన్ పేరుతో 85వేల మంది కార్మికులను రోడ్డుపాలు చేయడం సిగ్గుచేటు

వేంపల్లి: జూన్ 07 ప్రభాతవార్త



మధ్యాహ్న భోజన కార్మికులకు చట్టబద్ధత, వేతనాలు పెంచాలని ఏఐటియుసి పులివెందుల ఏరియా కార్యదర్శి బ్రహ్మం కొత్త కాల్వ పాలక ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వేంపల్లి ఏఐటియుసి మండల సమితి విలేకరుల సమావేశంలో ఏఐటియుసి నాయకులు మాట్లాడుతూ సెంట్రల్ కిచెన్ తీసుకురావడం చాలా దుర్మార్గం నీతిమాలిన చర్య అన్నారు. సెంట్రల్ కిచెన్ పేరుతో కార్మికులను తొలగించే, వారికి చట్టబద్ధత కల్పించకపోతే, రిటైర్డ్ బెనిఫిట్స్ క్రింద 5 లక్షలు ఎక్స్ గ్రేషన్ ఇవ్వాలని, పి యఫ్, ఈ యస్ ఐ కల్పించాలని, నెలకు 10 వేలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం అడుగుతుంటే కార్మిక కుటుంబ జీవితాలపై కడుపు కొట్టాలనుకునే ఆలోచన విరమించుకోవాలని వారన్నారు. లేనిపక్షంలో ఈ ప్రభుత్వం మూల్యం చెల్లించక తప్పదని వారు పాలక ప్రభుత్వాలను హెచ్చరించారు.

## కరుణగిరి కేశాపురం మధ్యలో వ్యక్తి మృతి

మైదుకూరు, జూన్ 07, ప్రభాతవార్త



కడప జిల్లా మైదుకూరు మండలంలోని జీవీ సత్రం నుండి కరుణగిరి కేశా పురం రహదారి మధ్యలో స్కూటీలో వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. వివరాలకు వెళితే బ్రహ్మంగారిమఠం కళ్యాణ్ కుమార్(32) కడప యూనియన్ బ్యాంకు లో పని చేస్తూ కడప నుండి శనివారం రాత్రి సమయంలో కాజీపేట జీవీ సత్రం కరుణగిరి కేశా పురం మీదుగా స్కూటీ లో బ్రహ్మంగారి మఠానికి వెళుతున్న సమయంలో మృతి చెందినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం.



గోపవరం. జూన్, 7. ప్రభాతవార్త.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈరోజు అనగా 07 06 2026 తేదీన గోపవరం మండలం గోపవరం గ్రామపంచాయతీ జడ్.పి హైస్కూల్ నందు 10 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపల ఉన్న పిల్లల చేత యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా 1. సూర్య నమస్కారం 2. ప్రాణాయామం 3. వజ్రాసనం చేయించడం అయినది ఈ కార్యక్రమం పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ ఎస్. విజయ కుమార్ పర్యవేక్షణలో జరిపిడమైనది

## లారీ ఢీ కొట్టడంతో వ్యక్తికి గాయాలు

మైదుకూరు, జూన్ 07, ప్రభాతవార్త:



మైదుకూరు పట్టణ మున్సిపాలిటీకి చెందిన నరసింహ జాతీయ రహదారి నంద్యాల రోడ్డు శ్రీ నగరం దగ్గర ఆగి ఉండడంతో కడప కి వెళ్తున్న రాజస్థాన్ లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఢీకొట్టడంతో బలమైన గాల గాయాలైనట్లు సమాచారం. స్థానికులు 108కు సమాచారం తెలపడంతో వెంటనే స్పందించి పొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు విచారిస్తున్నారు.

## బిసిల మహా సంకల్ప సభ ఘన విజయం.

మైదుకూరు, జూన్ 07, ప్రభాతవార్త:

విజయవాడ గాంధీనగర్‌లో నిర్వహించిన బిసిల మహా సంకల్ప సభ జాతీయ బిసి చైతన్య సమితి వ్యవస్థాపకులు బిసి రమణ ఆధ్వర్యంలో జరిగింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి బిసి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేశారు.ఈ సందర్భంగా బి సి రమణ మాట్లాడుతూ బిసి ల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారత కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. బిసిలకు తగిన ప్రాతినిధ్యం, హక్కులు, అవకాశాలు కల్పించే దిశగా పోరాటం కొనసాగుతుందని తెలిపారు.సభలో జాతీయ బిసి చైతన్య సమితి రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు ఎస్.నవీన్ కుమార్ పాల్గొని యువత బిసి ఉద్యమంలో కీలక పాత్ర పోషించాలని, సామాజిక మార్పు కోసం యువశక్తి ముందుండాలని పిలుపునిచ్చారు.అలాగే కడప జిల్లా అధ్యక్షుడు ఆర్. కుల్లాయప్ప, జిల్లా కార్యదర్శి మాల కొండయ్య, మైదుకూరు నియోజకవర్గ అధ్యక్షుడు కె. రామమోహన్, నియోజకవర్గ కార్యదర్శి వాద్దాండం శివశంకర్, బహుజన నేత మిద్దె వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. సభలో బిసి ల ఐక్యత, విద్య, ఉపాధి, రాజకీయ సాధికారత అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. బిసి ల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. వ్యవస్థాపకులు బిసి రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బిసి ల మహా సంకల్ప సభ ఘన విజయాన్ని సాధించగా, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు ఎస్. నవీన్ కుమార్ నేతృత్వంలో కడప జిల్లా నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి సభ విజయవంతానికి తోడ్పడ్డారు.



# జుట్టూడకుండా జాగ్రత్తలు..



చిన్న వయసులోనే జుట్టూడిపోవడం అన్నది ఈ మధ్య కామనైపోయింది. ఇందుకు కారణాలెన్నో. అయితే ఎవరికి గత్తలు తీసుకున్నట్లయితే జుట్టూడిపోకుండా కొంతవరకు కాపాడుకోవచ్చు. ఈ క్రమంలో జుట్టు ఆరోగ్యానికి పాటించాల్సిన కొన్ని చిట్కాల గురించి తెలుసుకుందాం..

- శరీరానికి హెల్దీ లైఫ్‌స్టైల్ ఎంత అవసరమో..శిరోజాల సంరక్షణకు కూడా ఆరోగ్యకరమైన జీవనశైలి తప్పనిసరి ఇందులో భాగంగా మంచినీళ్లు ఎకునకవగా తీసుకోఆలి. దీనివల్ల శరీరంలో నీటి స్థాయిలు పెరగడమే కాకుండా చరనమంలోని మలినాలు, వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. ఫలితంగా జుట్టుకూడా ఆరోగ్యాన్ని సంతరించుకుంటుంది. అవసరమైతే వైద్యులను సంప్రదించి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవాలి. ఇందులోని పోషకాలు జుట్టు ఆరోగ్యంగా ఉండడానికి సహకరిస్తాయి.
- జుట్టు బాగా ఆరోగ్యంగా పెరగాలంటే క్రమం తప్పకుండా హెయిర్‌ను ట్రిమ్ చేసుకోవాలి.
- తలస్నానానికి బాగా వేడిగా ఉండే నీళ్ల ఉపయోగించడం వల్ల జుట్టు కుదుళ్లను నష్టం కలుగుతుంది. కాబట్టి గోరువెచ్చని నీటినే తలస్నానానికి ఉపయోగించాలి. వెంట్రుకలు దృఢత్వాన్ని సంతరించుకోవాలంటే స్నానం తర్వాత కండిషనర్‌ను రాసుకోవడం తప్పనిసరి.
- స్నానం చేసిన తర్వాత సాధ్యమైనంతవరకు జుట్టును సహజంగానే ఆరనివ్వాలి. వేడి కలిగించే హెయిర్ డ్రయర్స్‌ను అధికంగా వాడడం వల్ల కుదుళ్లలో దురద, అలర్జీలు జుట్టు చివర్లు చిట్లడం.. వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాగే తలస్నానం చేశాక జుట్టుకు తుడుచుకునేందుకు రెగ్యులర్ టవల్ బదులు మైక్రోఫైబర్ ర్యాపర్స్‌ను వినియోగిస్తే మేలు.
- తలస్నానం చేసిన వెంటనే జుట్టును దువ్వకూడదు. అలా చేస్తే వెంట్రుకలు తెగిపోవడం, ఎక్కువ జుట్టు రాలిపోవడం. వంటి సమస్యలొస్తాయి. జుట్టు దువ్వకోవడానికి కూడా మెత్తటి బ్రిజిల్స్ ఉండే దువ్వెనను ఉపయోగించడం ఉత్తమం.



- చల్లటి ప్రదేశాలకూ వెళ్లినప్పుడు ఉన్నితో తయారుచేస్తే టోపీలతో జుట్టును కవర్ చేయడం ఉత్తమం లేకపోతే చల్లటి గాలులు కురులకు నష్టం కలిగిస్తాయి.
- కేశ సౌందర్య సమస్యలన్నింటినీ దూరం చేసుకుని ఆరోగ్యకరమైన జుట్టును సొంతం చేసువాలంటే మసాజ్ మించిన సాధనం లేదా కాబట్టి కనీసం వారానికోసారైనా హెయిర్ మసాజ్ చేసుకోవాలి. మసాజ్‌నుమించిన

# తనయుని విజయం వెనుక తల్లి !

క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌లనూ ఆడగల క్రికెటర్! ప్రపంచంలోని అత్యుత్తమ ఫాస్ట్ బౌలర్లలో ఒకడు. యార్కర్, బౌన్సర్, ఇన్‌స్వింగ్, ఔట్‌స్వింగ్.. అంటూ ఈ భారత ఫాస్ట్ బౌలర్ తన అమ్ములపొదిలోని అస్త్రాలతో.. ప్రత్యర్థికి చెమటలు పట్టించేస్తాడు. తాజాగా తన సూపర్ బౌలింగ్‌తో టీ20 2024 ప్రపంచకప్ పోటీల్లో టీమిండియాను ఛాంపియన్‌గా నిలిపాడు.. జస్‌ప్రీత్ బుమ్రా. అయితే, క్రికెటర్‌గా అతను రాణించడం వెనక.. తల్లి దల్జీత్‌కౌర్ పాత్ర ఎంతో!

పిల్లలు పసివాళ్లుగా ఉన్నప్పుడే భర్త జస్బీర్ సింగ్‌ని కోల్పోయారు దల్జీత్ కౌర్. అహ్మదాబాద్‌లో స్థిరపడిన పంజాబీ సిక్కు కుటుంబం వారిది. భర్తను పోగొట్టుకుని పుట్టెడు బాధలో ఉన్న కోడలిని చేరదీయాల్సిన బుమ్రా తాత సంతోక్ సింగ్ ఊరొదిలి వెళ్లిపోయాడు. దాంతో వారి జీవితం తలకిందులైంది. దల్జీత్ ఆ షాక్ నుంచి చాన్నాళ్లు కోలుకోలేకపోయారు. ఆర్థిక ఇబ్బందులతో బిడ్డలకు మూడుపూటలా భోజనమూ పెట్టలేని పరిస్థితి. అది గమనించిన దల్జీత్ స్నేహితురాలు దీపల్ నెలరోజులపాటు.. బుమ్రా, వాళ్లక్క జుహికా సంరక్షణ బాధ్యతని తీసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమించేందుకు అప్పటివరకూ గృహిణిగా ఉన్న దల్జీత్ గడపదాటి బయటకు రాక తప్పలేదు. కుటుంబ పోషణ కోసం టీచర్‌గా మారారు. కొన్నేళ్లలోనే ప్రిన్సిపల్ హోదానీ అందుకున్నారు. దీంతోపాటు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ.. రోజుకు 16 నుంచి 19 గంటలు కష్టపడేవారు. పిల్లలకి ఏ లోటూ రాకుండా చేసుకుంటూ వాళ్లకి ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించారు.

**ఆ శబ్దం విసుగు తెప్పించడంతో...** తల్లి ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న స్కూల్లోనే బుమ్రా ప్రాథమిక విద్య సాగింది. జస్‌ప్రీత్‌కి చదువు మీద పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. క్రికెటర్ కావాలని కలలు కనేవాడు. దల్జీత్ కూడా కొడుకు ఇంజినీరో, డాక్టరో అవ్వాలని ఒత్తిడి తేలేదు. నీ మనసు మాట విను.. కానీ, ఆంగ్ల భాషపై పట్టు సాధించమని మాత్రం చెప్పారట. రెండుమూడు భాషల్లో నైపుణ్యం ఉంటే ఏ వృత్తిలోనైనా ఎదగొచ్చనేది ఆమె నమ్మకం. టివిలో ఫాస్ట్ బౌలింగ్ చూసి రబ్బరు బంతిని గోడకు కొట్టి బౌలింగ్ సాధన చేసేవాడు బుమ్రా. అయితే,రోజూ ఆ శబ్దం దల్జీత్‌కి విసుగు తెప్పించేదట. దాంతో ఓ రోజు తక్కువ సౌండ్ వచ్చేలా ఆడుకోగలిగితేనే ఇంట్లో ఆడమని బుమ్రాకు చెప్పారట. అలా అమ్మ కోపానికి గురవ్వకుండా ఉండేందుకు కనిపెట్టిన టెక్నిక్కే.. అతడి కెరియర్‌ని మలుపు తిప్పింది. బంతిని ఫ్లోరింగ్, గోడ కలిసే చోట వేసి శబ్దాన్ని నియంత్రిస్తూ నేర్చుకున్న తొలిపాఠంతోనే షార్ప్‌గా యార్కర్లు వేయగలుగుతున్నానంటాడు బుమ్రా.

**అప్పుడు ఎంతగానో బతిమాలాడు...** మొదట్లో క్రికెట్‌లో రాణించగలడో లేదో అని భయపడ్డ. గుజరాత్ అండ్ 16లో ప్రతిభ చూపించినా.. అండర్ 19కి ఎంపిక కాకపోవడం బాధ కలిగించింది. దాంతో ఇక క్రికెట్ వదిలేయమన్నా. తిరిగి చదువుపై దృష్టిపెట్టి ఉద్యోగం సంపాదించమని కోరా. నా మాట కాదనలేకపోయాడు. కొన్నాళ్లు అలానే చేశాడు. కానీ, వాడి మనసు మాత్రం క్రికెట్‌మీదే ఉండేది. అందుకే, తిరిగి నన్ను ఒప్పించాలని పదే పదే ప్రయత్నించేవాడు. నేనూ ఇక వాడి ఆసక్తి చూసి సరేనన్నా. అది మొదలు వాడి దశ తిరిగింది. ముంబై ఇండియన్స్ ఐపిఎల్ జట్టులో సభ్యుడిగా తరవాత మరెన్నో దేశీయ, అంతర్జాతీయ మ్యాచుల్లో ఫాస్ట్ బౌలర్‌గా తన ప్రతిభ చూపించాడు. అయితే, నన్నో విషయం ఇప్పటికీ బాధపెడుతుంది. అప్పట్లో ఆర్థిక పరిస్థితులు బాగోలేక ఆరంభంలో బుమ్రాకు ఓ నాణ్యమైన క్రికెట్ కిట్‌ని కూడా కొనలేకపోయా. నన్ను అర్థం చేసుకుని ఉన్న ఒక జత షూ, టీషర్టులనే ఉతుక్కుని ప్రాక్టీస్ చేసేవాడు. చిన్నప్పటి నుంచీ నా కొడుకు సిగ్గరి. ఏ విషయమైనా నాతో చెప్పనిదే, నా అనుమతి లేనిదే ముందుకెళ్లేవాడు కాదు అంటే తన బిడ్డ గురించి చెప్పి మురిసిపోతారు దల్జీత్. తాజాగా బుమ్రా ఐసిసి టి 20 ప్రపంచకప్ పోటీల్లో ఆటను మలుపు తిప్పడమే కాదు.. 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ గెలుచుకున్నాడు. అమ్మ లేకపోతే క్రికెటర్‌గా నాకు కెరియర్ లేదంటాడు బుమ్రా. ' క్లిష్ట సమయాల్లో స్థితప్రజ్ఞత, సమయ పాలన పాటించడం ఎలానో తల్లి నుంచే నేర్చుకున్నానీ, అమ్మే తన స్ఫూర్తి అని అంటారు. 'నేనీ స్థితిలో ఉండటానికి నా తల్లి చేసిన త్యాగాలెన్నో. తనకు ఏమిచ్చినా రుణం తీర్చుకోలేను. జీవితాంతం ఎలాంటి కష్టం కలగకుండా చూసుకోవడం తప్ప..! మ్యాచ్‌కి ముందు వీలైతే అమ్మను కలుసుకోవడం, లేదంటే ఫోన్లో మాట్లాడడం. సెంటిమెంట్ అని చెబుతాడు ఈ టీమిండియా పేసర్. 2021లో స్పోర్ట్స్ ప్రెజెంటర్ సంజనా గణేశన్‌ను వివాహం చేసుకున్నాడు. ఈ జంటకు ఒక అబ్బాయి.





# ఇండక్షన్ స్టౌ వాడేటప్పుడు..



**ఇండక్షన్ స్టౌ.. మామూలు స్టౌతో పోలిస్తే దీని వాడకంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే ఒక్కోసారి కొన్ని సమస్యలు ఎదురయ్యే అవకాశముంటుంది. ఈ క్రమంలో ఇండక్షన్ స్టౌ ఉపయోగించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో ఓసారి చూద్దాం..**

- ఇండక్షన్ స్టౌ వాడుతున్నప్పుడు సాధ్యమైనంత వరకు దానికి సరిపోయే పాత్రలనే ఎంచుకోవాలి.
- కొందరు ఇండక్షన్ స్టౌని సైతం గ్యాస్ స్టౌ పక్కనే పెడుతుంటారు. దీనివల్ల సాధారణ సమయాల్లో ఎలాంటి నష్టం కలగదు. కానీ ఎప్పుడైనా పొరపాటున గ్యాస్ లీకైతే మాత్రం ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకు కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై వేర్వేరు చోట్ల అమర్చుకోవడం తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.



- ఇండక్షన్ స్టౌ రేడియోలు, టివిలు, కంప్యూటర్లకు దూరంగా ఉంచాలి. ఎందుకంటే అయస్కాంత క్షేత్ర ప్రభావం వల్ల అవి పాడైపోయే అవకాశాలున్నాయి.
- ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్స్‌టెన్షన్ ప్లగ్ బాక్సులకు ఇండక్షన్ స్టౌ ప్లగ్‌ని అనుసందానించకూడదు.
- ఇండక్షన్ స్టౌ శుభ్రం చేసే క్రమంలో నీటిని ఉపయోగించకుండా మెత్తని వస్త్రంతో మాత్రమే తుడవాలి.
- ఇండక్షన్ స్టౌకి ఉన్న రంధ్రాల్లో దుమ్ము, ధూళి చేరకుండా చేసుకోవాలి.
- అలాగే స్టౌ దగ్గర్లో ఎలాంటి లోహ సామగ్రిని ఉంచకూడదు.
- ఇండక్షన్ స్టౌ విద్యుత్‌తో పనిచేస్తుంది. కాబట్టి వీలైనంత వరకుదీనిని చెక్క టేబుల్‌పై పెట్టడం మంచిది. అంతే కాకుండా సెరామిక్ టైల్స్, సిమెంట్ ఫ్లోర్ పైన కూడా పెట్టుకోవచ్చు. అయితే ఈ స్టౌ మెటర్ టేబుల్ పైన మాత్రం పెట్ట కూడదు. దీనివల్ల షాక్ కొట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

# లవంగంతో ఆరోగ్యం ..



లవంగాలు ఆహారంలో భాగం చేసుకుంటే క్యాన్సర్, మదుమేహం, పంటినొప్పి వంటి సమస్యలు నయం అవుతాయని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ వెల్లడించింది. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్ల మేటరీ గుణాలు పుష్కలంగా ఉండి ఫ్రీరాడికల్స్‌తో పోరాడి బరువుని తగ్గిస్తాయి.

- లవంగాల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఎలాజిక్ ఆమ్లాలు క్యాన్సర్ కణాలను వృద్ధి చెందకుండా కాపాడతాయి.
- కడుపులో అల్సర్‌తో బాధపడే వారికి లవంగాలు ఉపశమనం కలిగిస్తాయి. వీటిల్లో ఉండే యాంటీ ఇన్ఫ్ల మేటరీ గుణాలు, అల్సర్ వల్ల వచ్చే మంటను తగిస్తాయి.
- బరువు తగ్గించడంలో లవంగాలు కీలకపాత్ర పోషిస్తాయి. వీటిలో యాంటీ ఆక్సిడెంట్లు విటమిన్ ఎ, సి, ఇ, కె విటమిన్లూ, డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉండి, కొవ్వులను వేగంగా కరిగించి బరువుని నియంత్రణలో ఉంచుతాయి.

# చిన్నారులకు పోషకాహారం..

**ఏడాది నిండుతున్న బుజ్జాయిలకు ఆహారాన్ని అందించడ మనేది ప్రతి తల్లికీ ఒక సవాలే. పోషకాలతో చిన్నారుల పొట్టనెలా నింపాలని సతమతమయ్యే తల్లులకు నిపుణులు కొన్ని సూచనలిస్తున్నారు. బుజ్జాయిని ఫుడీగా ఎలా మార్చొచ్చనేదీ వివరిస్తున్నారు.**



ఆహారంలో ఏదో ఒకటి కాకుండా ఆరోగ్యానిచ్చేవాటిని పిల్లలతో ఎలాగైనా తినిపించాలనే ప్రయత్నంలో చిన్నారులు అయిష్టపడుతున్నా కూడా తినిపిస్తారు కానీ ఈ పద్ధతి సరైనది కాదంటున్నారు నిపుణులు. దీనివల్ల భోజనంపై పుర్తిగా ఆసక్తి తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. మరికొందరైతే ఆహారాన్ని మెత్తగా చేసి పిల్లలకు బలవంతంగా అందిస్తారు. ఈ విధానం కూడా తప్పే అంటున్నారు. ఇలా చేస్తే నమలడమనే ప్రక్రియ పిల్లలకు పరిచయం కాదు. మింగేస్తుంటారు కొత్తగా దంతాలొస్తున్న ఆ వయసులో చిన్నారులు వాటిని ఉపయోగించక పోవడంన ఆహారంతో లాలా జలం కలవక జీర్ణసమస్య ఎదురవుతుంది. ఇలా మెత్తగా చేసిచ్చే ఆహారంలో పీచు, పోషకాలు అందక, మెరుగైన జీర్ణశక్తిని కోల్పోతారు.

**సహనంతో తినిపించాలి..** పోషకాహారంవైపు చిన్నారులను అడగు వేయించడంలో కాస్తంత సహనాన్ని పాటించాలి. అలాకాకుండా ఆసక్తిగా తింటున్నారని అదే రకమైన ఆహారాన్ని ప్రతి రోజూ అందిస్తే పిల్లలు దానివైపు కన్నెత్తికూడా చూడరు. అప్పుడు మరొక కొత్తరకాన్ని తినిపించడానికి ప్రయత్నించినా అయిష్టత ప్రదర్శిస్తారు. ఈ దశనే వైద్యులు 'నియో ఫోబియో' అంటున్నారు. కొత్త ఆహారాలపై ఉండే ఈ భయాన్ని దాటించడానికి పెద్దవాళ్లు ప్రయత్నిస్తూనే ఉండాలి. సలాడ్స్ చేసేటప్పుడు వారినీ భాగస్వాములను చేయాలి. పండ్లతో రకరకాల ఫుడ్ ఆర్ట్ నేర్పించాలి. చిన్న మొత్తంలో అందించాలి. ఇవన్నీ వాళ్లలో ఆహారంపై ఆసక్తిని పెంచుతాయి.

**రంగులమయంగా కనిపించాలి..** ఆహారంపై ఆసక్తిని పెంచాలంటే వాళ్లెదుట ఉంచే బౌల్ లేదా ప్లేటు ఆకర్షణీయంగా ఉండాలి. భోజనం ప్లేటులో స్ట్రాబెర్రీలు, ఉడికించిన క్యారెట్ వంటివి వాళ్లకు కలర్‌ఫుల్‌గా కనిపిస్తాయి. ప్లేటుతోపాటు చుట్టూ వాతావరణం కూడా ప్రోత్సహించేలా ఉండాలి. కుటుంబసమేతంగా భోజనం చేయాలి. పిల్లలు వాళ్ల తల్లిదండ్రులను ఎక్కువగా అనుకరిస్తుంటారు. అందుకే పెద్దవాళ్లు పోషకాలున్న ఆహారానికి ప్రాధాన్యతనిస్తూ, వాటిని ఆస్వాదిస్తూ తీసుకోవాలి. వాటి రుచిని మాటల్లో చెబుతుండాలి. ఇప్పుడు చిన్నారులను తప్పక ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకునే ఫుడీగా మారుస్తాయి.

# హనుమ సద్గుణాలు..



**హనుమ మాతృభక్తి పరాయణుడు** మనం ఆ సుగుణాన్ని అలవరచుకుంటే వృద్ధాశ్రమాలే ఉండవు. పావని ప్రభుభక్తిపరుడు. ప్రభువంటే రాజు, యజమాని. హనుమకి ప్రభువు సుగ్రీవుడు. సుగ్రీవాజ్ఞకు తిరుగులేదు. సీతజాడ కనిపెట్టమని ఆదేశించగా.. ఆంజనేయుడు సముద్రాన్ని దాటి, సీతమ్మ జాడ కనిపెట్టాడు. అటు రామకార్యాన్ని, ఇటు రాజాజ్ఞను నెరవేర్చాడు. ఆ కార్యదీక్షను, ధైర్యసాహసాలను అలవరచుకోవాలి. ఆంజనేయస్వామి-స్వామిభక్తి ప్రపూర్ణుడు. స్వామి అంటే ఎవరు? సాక్షాత్తు శ్రీరాముడు. తన వినయం, విధేయత, భక్తి, సేవలతో స్వామిని అలరించాడు. ఆంజనేయుడిపట్ల అంత నమ్మకం ఉన్నందునే తన అంగులీయకాన్ని ఇచ్చి పంపాడు రాముడు. అతడే కార్యసాధకుడన్న మహావిశ్వాసం రాముడిది. అడుగడుగునా ఎదురైన ఆటంకాలనిననటినీ అధిగమించాడు. సీతా మహాసాధ్విని కలిసి, ఆనవాలును చూపాడు. ఆ తల్లిని ఓదార్చాడు. తిరిగి రాముని చేరుకుని, ధైర్యం చెప్పి, రావణ సంహారంలో ఎన్నో విధాల సహకరించాడు. సీతారాములను కలిపాడు. అంతేనా! వారిని తన హృదయంలో స్థిరపరచుకున్న భక్తాగ్రేసరుడు అంజనీపుత్రుడు. పరోపకారానికి, లోకశ్రేయస్సుకి మరో రూపం ఆంజనేయుడు. లక్ష్మణుని బతికించడానికి ఏకంగా సంజీవని పర్వతాన్నే పెకలించుకుని వచ్చాడు. దుష్టసంహారం, చేసి, జగత్తుకు ఎనలేని మేలు చేకూర్చాడు. నిత్యం రామనామ స్మరణతో భూలోకాన్నే పునీతం చేశాడు. రామభక్త హనుమంతుని ఆరాధనతో ఇన్ని సద్గుణాలు అలవడతాయి. రామ మందిరం లేని ఊరుండదు,హనుమ లేని రామ మందిరం ఉండదు. రాముడెక్కడ ఉంటే, ఆంజనేయుడు అక్కడే ఉంటాడు మరి. అంతేకాదు, ఆంజనేయుడికి ప్రత్యేక ఆలయాలు కూడా వేలాదిగా ఉన్నాయి. పంచముఖ ఆంజనేయుడు, ప్రసన్నాం జనేయుడు, భక్తాంజనేయుడు, అభయాంజనేయుడు, బడా హనుమాన్, వీరాంజనేయుడు, శయనాంజ నేయుడు ఇలా అనేక నామాలు,

ఆధ్యాత్మికం

# సైంధవలవణం మంచిది..



**ఉప్పు వీలైనంత తగ్గంచమని పదేపదే హెచ్చరిస్తోన్న ఆహార నిపుణులు సైంధవ లవణం చాలా మంచిదని చెబుతున్నారు. పెద్ద పెద్ద చెఫ్‌లు ఇది ఆరోగ్యకరమని, కొన్ని వంటల్లో ప్రత్యేకంగా దీన్నే ఉపయోగించమంటున్నారు. ఇంతకీ సైంధవ లవణం ఎందుకు మంచిదో, దాని వల్ల ఏమేం లాభాలున్నాయో చూద్దాం.**

పింక్‌సాల్ట్‌లో సోడియం, క్లోరైడ్, సల్ఫర్, ఐరన్, పొటాషియం,మెగ్నీసియం, మాంగనీస్, కాపర్, జింక్‌లు ఉన్నాయి. మామూలు ఉప్పు వాడటం వల్ల వచ్చే అనారోగ్యాలు దీని వల్ల రావు. సైంధవలవణాన్ని ఉపయోగించడం వల్ల ఆహారం చక్కగా జీర్ణమవుతుంది. కీళ్లనొప్పులు, మెకాళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. సాధారణ ఉప్పుతో పోలిస్తే ఇందులో సోడియం పరిమాణం తక్కువ. కనుక శరీరంలో సోడియం పేరుకోదు. ఇది ఒంట్లో పేరుకున్న కొవ్వును కరిగిస్తుంది. కుదుళ్లను ఆరోగ్యంగా ఉంచి, జుట్టు రాలకుండా కాపాడుతుంది. శరీరంలో చేరిన అనేక రకాల సూక్ష్మక్రిములను నశింపచేస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్ గుణాలున్నాయి. ఎనీమియాతో బాధ పడుతున్న వారికి ఎంతో మేలు చేస్తుంది. గృహచిట్కాల్లో ఇదిముందుంటుంది. కడుపునొప్పి,మలబద్ధకం, గుండెమంట, కడుపుబ్బరం లాంటి ఇబ్బందులను నివారిస్తుంది.

# ఉద్యోగం మారాల్సిందేనా?

**నచ్చిని చోట, ఉన్నతి లేని చోట పనిచేయడం కంటే ప్రత్యామ్నాయం వెతుక్కొని కెరీర్‌లో అభివృద్ధిని సాధించడం ఇటు వ్యక్తిగతంగా, అటు వృత్తిపరంగా మంచిదంటున్నారు. మరి, ఇంతకీ పని వాతావరణాన్ని నెగటివ్‌గా ప్రభావితం చేసే కొన్ని అంశాలేంటో తెలుసుకుందాం..**

**మిమ్మల్ని దూరం పెడుతున్నారా? ....** ఒక బృందం ప్రాజెక్ట్ మీద పని చేస్తోందంటే దానికి సంబంధించిన ప్రతి విషయం, ప్రతి అప్‌డేట్ ఆ గ్రూప్‌లో ఉన్న అందరికీ తెలిస్తేనే కలిసికట్టుగా ముందుకెళ్లగలం.. అనుకున్న సమయానికి చక్కటి అవుట్‌పుట్‌ని కంపెనీకి సమర్పించవచ్చు. అయితే బాగా పనిచేసే వాళ్లపై ఇతర కొలీగ్స్‌కి ఉండే అసూయ, సహోద్యోగుల మధ్య కమ్యూనికేషన్ లోపం, గ్రూపిజం.. వంటి అంశాలు పని వాతావరణాన్ని దెబ్బతీస్తుంటాయి. ఇలాంటి చోట మీరు పని చేస్తున్నా, చక్కటి నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నా మిమ్మల్ని వేరు చేసి చూడడం, పనికి సంబంధించి మీకు ఎలాంటి అప్‌డేట్ చెప్పకపోవడం..వంటి అంశాలు మీ వ్యక్తిగత పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఇది క్రమంగా మీ మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. అంటే



అంతిమంగా మీ కెరీర్ ఉన్నతికి గండి పడ్డటే! కాబట్టి ఇలాంటి వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు మీ వెనక జరిగే గ్రూపిజం, ఆఫీస్ రాజకీయాల గురించి మీ తీరు గురించి ముందుగా పై అధికారులకు తెలియజెప్పే ప్రయత్నం చేయండి. అయిన లాభం లేదనుకుంటే అందులోనే వేరే విభాగానికి మారడం లేదంటే వేరే ఉద్యోగం వెతుకోనకవడం వల్ల కెరీర్ ముందుకెళ్లచ్చు.

**ఎంత చేసినా బూడిదలో పోసిన పన్నీరే!.........** వచ్చిన ఉద్యోగం వచ్చింది. ఇక నా పనితనమేంటో చూపిస్తా.. అంటూఎంతో ఉత్సాహంగా తాము కోరుకున్న జాబ్‌లో జాయినవుతుంటారు చాలామంది. అయితే అక్కడికెళ్లి కొన్నాళ్ల పాటు ఉద్యోగం చేస్తే గానీ తెలియదు ఆ కంపెనీ పని వాతావరణం గురించి! ఈ క్రమంలో ఎంత పని చేసినా సరైన ప్రోత్సాహకాలు లేకపోవడం, కొన్ని కంపెనీల్లోనైతే పనిచేసే వారికంటే చేయని వారికే అధిక ప్రాధాన్యమిస్తూ వారికే పై అధికారుల నుంచి ప్రోత్సాహం లభించడం..వంటివి కూడా జరుగుతుంటాయి. అయితే ఇలాంటి వాతావరణం ప్రత్యక్షంగా మనం చేసే పనిపైన కూడా ప్రతికూల ప్రభావం చూపుతుంటుంది. 'ఛ..ఛ.. ఎంత పని చేసినా బూడిదలో పోసిన పన్నీరే! అన్న భావన కలిగేలా చేస్తుంది. నిజానికి ఆ ఫీలింగ్ వచ్చిందంటే అలాంటి చోట పని చేయలేమని అర్థం. అందుకే అక్కడే రోజులు గడిపేయడం కాకుండా సత్వరమే వేరే ఉద్యోగంలోకి మారిపోవమే మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల ఆ సమయాన్ని వేరే కంపెనీలో కరీర్‌లో ఉన్నతి సాధించడానికి వినియోగించుకోవచ్చు.

**పనిభారమంతా మీదేనా ?...** చేసే ఉద్యోగమేదైనా సరే.. మనకు అప్పగించిన పనికే పరిమితం కాకుండా.. ఫలానా పనిని నేను చేయగలను అన్న ఆత్మవిశ్వాసంతో, యాక్టివ్‌గా ఆ పనిని స్వీకరించాలి. ఈ క్రమంలో మీలోని సృజనాత్మకతను చాటుకుంటే మరి మంచిది అయితే ఈ చురుకుదనం ఒక్కోసారి మన తలపై భారంగా మారే అవకాశాలూ లేకపోలేదు. ఎలాగూ ఈ అమ్మాయి యాక్టివ్‌గా పనిచేస్తుంది కదా అని కొంతమంది అధికారులు సహోద్యోగుల పనిని కూడా వారి నెత్తినేస్తుంటారు. దీనివల్ల మోయలేని భారం మీపై పడడంతో పాటు అంతిమంగా ఇది మీపై ఒత్తిడిని తీసుకొస్తుంది. తద్వారా మీరు చేసే పనిలో నాణ్యత లోపిస్తుంది.

# మహిళా భద్రతపై అవగాహన

ఎస్సీ కాలనీలో మహిళా భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలకు శక్తి యాప్ ఉపయోగాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.సి.ఐ నరసింహులు మాట్లాడుతూ ప్రమాదకర పరిస్థితుల్లో శక్తి యాప్‌లోని ఎస్.ఓ.ఎస్ బటన్‌ను ఉపయోగించడం ద్వారా లేదా డయల్112కు కాల్ చేయడం ద్వారా తక్షణ పోలీసు సహాయం పొందవచ్చన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సందర్భంగా డయల్112, చైల్డ్ లైన్1098, గృహ హింస బాధితుల కోసం 181, మహిళల వేధింపుల ఫిర్యాదుల కోసం 1091, సైబర్ నేరాల కోసం 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్ల వివరాలను తెలియజేశారు. మహిళలు తమ హక్కులు, భద్రతకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## అనుమానితులకు పోలీసుల కౌన్సెలింగ్



**ముద్దనూరు, జూన్ 07 ప్రభాతవార్త:**
కడప జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు స్థానిక సీఐ నగేష్ బాబు ఆదివారం నాడు రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులకు పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు, అనుమానితులను వ్యక్తిగతంగా విచారించి, ఇటీవల ఏవైనా గొడవలు, వివాదాలు లేదా ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నారా అనే అంశాలపై ఆరా తీశారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని, చట్టాన్ని గౌరవిస్తూ సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. అలాగే నేరాలకు దూరంగా ఉండాలని, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని సీఐ హెచ్చరించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మీకు ఏ సమస్య ఉన్నా గానీ నేరుగా మా దృష్టికి తీసుకొని వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని తెలిపారు.

## 104 ద్వారా ఆరోగ్య సేవలు

**నందలూరు, జూన్ 7 ప్రభాతవార్త :**



కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు 104 వాహనం ద్వారా ప్రత్యేక ఆరోగ్య సేవలు అందించనున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శరత్ కమల్ తెలిపారు. టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించి నిర్మూలించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో టీబీ లక్షణాలు ఉన్న ప్రతి వ్యక్తికి అక్కడికక్కడే ఉచితంగా ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్హెచ్‌పీలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి, టీబీ లక్షణాలు ఉన్న వారిని శిబిరాలకు తీసుకురావాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 8న నాగిరెడ్డిపల్లె1, 9న నాగిరెడ్డిపల్లె2, 10న నందలూరు, 11, 12 తేదీల్లో టంగుటూరు గ్రామ సచివాలయాల పరిధిలో 104 వాహనం ద్వారా ఆరోగ్య సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

## డ్రైనేజీ, సిసి రోడ్డు సమస్యను పరిష్కరించాలి

**డీసీసీ బ్యాంక్ చైర్మన్‌కు కాలనీవాసుల వినతి**



**బద్వేల్ అర్బన్ జూన్ 07 ప్రభాతవార్త :**
బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డ్ (ఆంజనేయ నగర్ కొలిమి వీది సందు) లో సెంటర్ డ్రైనేజీ, సిసి రోడ్డు మంజూరు చేయించి, కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసుల విన్నపంపై డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి స్పందించారు. ఆంజనేయ నగర్ కొలిమివీది సందులో డ్రైనేజీ, సిసి రోడ్డు ఏర్పాటుకు త్వరలోనే తగిన కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు తులసి వెంకట శివనారాయణ, దర్శి వెంకటసుబ్బయ్యతో పాటు వడ్లపూడి నాగభూషణం, గోనుగుంట్ల సతీష్ మరియు పలువురు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

### మూడు రోజుల్లోగా

## 95 శాతం సర్ పూర్తి చేయాలి

**రాజంపేట సబ్ కలెక్టర్**



**సిద్దవటం జూన్ 7 ప్రభాతవార్త**
మూడు రోజుల్లోగా 95 శాతం సర్ పూర్తి చేయాలని రాజంపేట సబ్ కలెక్టర్ భావన అధికారులను ఆదేశించారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ శివుని పల్లి గ్రామంలో ఆదివారం సబ్ కలెక్టర్ బిఎల్ఓ లు సర్ మ్యాపింగ్ చేస్తున్నారా లేదా అని క్షేత్ర స్థాయిలో ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. సిద్దవటం మండలంలో ఇప్పటి వరకు 62.5 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని తహసీల్దార్ విజయ్ కుమార్ సబ్ కలెక్టర్ కు వివరించారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్లి 95 శాతం మ్యాపింగ్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. అలాగే సిద్దవటం నందు స్మార్ట్ కిచెన్ పనులను ఆమె పరిశీలించారు త్వరగా పనులను పూర్తి చేయాలని గుత్తేదారునికి చెప్పడమైనది ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## యాప్ ఆధారితతో యూరియా, డిఏపి పంపిణీ

**దువ్వూరు, జూన్ 07, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని రైతులకు సోమవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాలకు సంబంధించి యాప్ ఆధారిత ద్వారా యూరియా, డిఏపి పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం యూరియా, డిఏపిలకు మాత్రమే సబ్సిడీ ఇస్తున్నందున ఈ రెండు రకాల ఎరువుల ధరలు తక్కువగా ఉన్నందున ఈ ఏర్పాట్లు చేశారన్నారు. ప్రతి దుకాణాదారుడు అలాగే సహకార సొసైటీలు, గ్రోమోర్, జై కిసాన్ వంటి దుకాణాలు ఈ విధానాన్ని చేపట్టాలన్నారు. సాగు చేసే ప్రతి రైతుకు యూరియా, డిఏపి లభ్యతకు హామీ ఇస్తున్నామని, పారదర్శకమైన, సరళమైన విధానం ద్వారా ఇవి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యూరియాను వ్యవసాయేతర అవసరాలకు వాడకుండా ఉండేందుకు ఈ యాప్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సమర్థమైన నియంత్రణ మరియు పర్యవేక్షణ ద్వారా రెండు రకాల ఎరువులు పంపిణీ జరుగుతుందని అందువల్ల రైతులు వేసే పంటలను ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

## నయం కాని వ్యాధిని దాచిపెట్టి చేసిన వివాహం చెల్లనేరదు

**(విడాకులు మంజూరు చేస్తూ వివాహాన్ని రద్దు చేసిన బాంబే హైకోర్టు)**

**బద్వేలు లీగల్, జూన్ 07 ప్రభాతవార్త:**
వివాహానికి ముందే ఓ మహిళ తనకు "సెలిబ్రల్ పాల్సీ" వంటి నయం కాని వ్యాధి ఉన్న విషయాన్ని దాచిపెట్టి వివాహం చేసుకున్న ఓ మహిళకు విడాకులు ఇవ్వవచ్చు అని బాంబే హైకోర్టు తీర్పును వెలువరించింది. నయం కాని వ్యాధి ఉన్న విషయాన్ని దాచిపెట్టిన పర్యవసానంగా హిందూ వివాహ చట్టం ప్రకారం భర్త విడాకులు తీసుకోవచ్చని జస్టిస్ నితిన్ సూర్యవంశీ, జస్టిస్ సందీప్ కుమార్ మోరేలతో కూడిన ధర్మాసనం తీర్పును ప్రకటించింది. "సెలిబ్రల్ పాల్సీ" వ్యాధి సంతోషకరమైన వైవాహిక జీవితానికి, లైంగిక ఆనందానికి అడ్డుకట్ట కాకపోయినప్పటికీ వివాహ సమయంలో ప్రతివాది భార్య ఈ వ్యాధిని దాచిపెట్టడం చాలా ముఖ్యమైన విషయం అని, వివాహానికి ముందు ఈ విషయం వెల్లడించి వుంటే భర్త పెళ్లి చేసుకోవాలా? వద్దా? అనే విషయంలో పునరాలోచించేవాడని, అందువల్ల భార్యకు ఉన్న సెలిబ్రల్ పాల్సీ వ్యాధిని ఆమె కుటుంబ సభ్యులు వివాహానికి ముందు దాచిపెట్టడం వలన భర్తకు సెక్షన్-12(1)(సి) క్రింద వివాహ రద్దుకు అర్హత లభిస్తుందని ధర్మాసనం పేర్కొంది. సెక్షన్-12(1)(సి) ప్రకారం మోసం చేసి మరీ వివాహం జరిగిన సందర్భంలో విడాకులు మంజూరు చేస్తారు, ఈ వ్యాజ్యములో భార్య తన భర్తతో ఆరేడు మాసాలు మాత్రమే కాపురం చేసి ఆ తరువాత తన తల్లిదండ్రులతో ఉన్నట్లు ధర్మాసనం గమనించింది. ప్రతివాది భార్యకు నయం కాని వ్యాధి ఉన్న విషయాన్ని ఆమె లేదా ఆమె కుటుంబ సభ్యులు దాచిపెట్టిన అంశాన్ని పరిగణన లోనికి తీసుకోకుండా, ఫ్యామిలీ కోర్టు భర్త పిటీషన్‌ను కొట్టివేసి పొరబాటు చేసిందని తాము భావిస్తున్నట్లు ధర్మాసనం ఈ సందర్భంగా పేర్కొనింది. ఈ క్రమంలో ఫ్యామిలీ కోర్టు తీర్పును రద్దు చేసి భర్తకు విడాకులు మంజూరు చేసింది. అయితే భార్యకు లభించే భరణం, ఇతర సహాయాల గురించి మాత్రం ధర్మాసనం వ్యాఖ్యానించలేదు. (శీర్షిక: ఎన్.హెచ్.ఎస్ ఎదిరి ఎఎన్ఎస్ (ఫ్యామిలీ కోర్ట్) అప్పీల్ నెం.92/2023)

## ఊటుకూరులో వైభవంగా అంకాలమ్మ జాతర

**రాజంపేట, జూన్ 7 ప్రభాతవార్త**
మండలంలోని ఊటుకూరులో అంకాలమ్మ జాతర గ్రామోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. జాతరతో రెండు రోజులుగా గ్రామంలో కోలాహలంగా మారింది. అంకాలమ్మ మూలమూర్తికి ఘనంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంకాలమ్మ ఉత్సవమూర్తిని చూడ ముచ్చటగాగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. జాతరకు బంధుమిత్రులతో గ్రామం కిటకిటలాడింది. గ్రామోత్సవంలో కోలాటం, తప్పెట్లు బ్యాండ్తో యువకులు కేరింతలు కొట్టారు. తెల్లవారుజామున గ్రామ దేవతను ప్రతిష్టించారు. అనంతరం భక్తులు తమ మొక్కలు చెల్లించుకున్నారు. అంతకుముందు జాతరకు రాజంపేట నుంచి మోటార్ సైకిళ్ల పై శ్రీనివాసరాజు ర్యాలీగా వెళ్లారు. ఊటుకూరులో భారీ గజమాలతో పెడకాల సుధాకర్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో జనసేన నాయకులు స్వాగతం పలికారు. మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు సూర్యనారాయణ, శివన్నారాయణ, ఓబయ్య, సుబ్బయ్య, జనసేన కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.





### శ్రీభావనారాయణ స్వామి గుడికి

## యావదాస్తిని సమర్పించిన కోటా రామసుబ్బమ్మ

**ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు ఘన సత్కారం**

**ప్రొద్దుటూరు అర్బన్ జూన్ 7 ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ స్వర్గీయ కోటా సంజీవరాయుడు సతీమణి కోట రామసుబ్బమ్మ తన యావదాస్తిని స్థానిక రామేశ్వరం లోని శ్రీ భావనారాయణ స్వామి ఆలయ కమిటీకి సమర్పించింది. ఈ నేపథ్యంలో ఆదివారం పద్మశాలియ బుహూత్తమ సంఘం మరియు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ కౌన్సిలర్ స్వర్గీయ కోటా సంజీవరాయుడు సతీమణి కోటా రామసుబ్బమ్మకు సంతానం లేకపోవడంతో తనకున్న ఇంటిని కొంత నగదును భావనారాయణ స్వామి ఆలయ కమిటీ సమర్పించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఉన్నంతకాలం ఆలయ కమిటీ అన్ని రకాలుగా అండగా ఉంటుందని ఆమెకు చేయవలసిన ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వర్గీయ కోటా సంజీవరాయుడు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తన యావదాస్తిని సమర్పించిన కోటా రామసుబ్బమ్మ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు బీసీ సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ లక్ష్మీ నరసయ్య జిల్లా పద్మశాలియ సంఘం అధ్యక్షులు చెన్నా వెంకట కృష్ణయ్య ఆలయ కమిటీ అధ్యక్షుడు మేరువ పెంచలయ్య మరియు పద్మశాలియ భుహత్తమ సంఘం నాయకులు ఆడిటర్ వరదరాజులు నందం కుమార్ జింకా ప్రకాష్ పాల్గొన్నారు.



## మౌలిక వసతులు కల్పించాలి

**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 7, ప్రభాతవార్త:**
పట్టణంలోని అమృతనగర్‌లో కరెంటు, రోడ్లు, మంచినీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం పార్టీ కార్యదర్శి నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2200 మందికి 2009లో మరియు 2018లో అమృతనగర్‌లో స్థలాలు ఇచ్చారు మౌలిక వసతులు కల్పించలేదని వాటిని వెంటనే ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద అమృతనగర్‌లో స్థలాలు తీసుకున్న వారికి ఆయన పిలుపునిచ్చారు. విజయవంతం చేయాలని తెలిపారు. గత 22వ తేదీన ముద్దనూరుకు మంత్రి లోకేష్ రావడంతో తమ సమస్యలు తెలిపామని ఆయన స్పందించి కడప హౌసింగ్ శాఖకు రెఫర్ చేయడం జరిగిందన్నారు. డీఈ వారి బృందం వచ్చి ఆ స్థలాలను పరిశీలించి మౌలిక వసతులు కల్పనకు కలెక్టరుకు నివేదిక పంపిస్తామని తెలిఎపారు. కానీ ఇంత వరకు ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి పంపలేదని డీఈ జోక్యం చేసుకొని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యుడు పకీరయ్య, డీవైఎఫ్ఐ కార్యదర్శి బి.విశ్వనాథ్ పాల్గొన్నారు.



## పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

**దువ్వూరు, జూన్ 7, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ప్రాథమిక పాఠశాల యందు నిర్వహించారు. ఈ సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను ఇంతవరకు పరిష్కరించలేదని వాటిని పరిష్కరించాలన్నారు. 12వ పిఆర్సిని ఏర్పాటు చేయలేదని ప్రస్తుతం 1.7.2023 నుండి అమలు కావాల్సి ఉండగా దానికి సంబంధించిన ఏర్పాట్లు ఇంతవరకు జరగలేదన్నారు. అలాగే ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయన్నారు. దాదాపు 8 లక్షల మంది ఉద్యోగులు వీటి కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం క్లిష్ట సమయంలో 12వ పిఆర్సి రావాల్సి ఉందని దాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యోగుల పెన్షనర్లకు ఐఆర్ ప్రకటన మంజూరు చేసి ఊరట కల్పించాలన్నారు.

**కార్యవర్గం ఎన్నిక:** అలాగే ఈ సమావేశంలో 2026, 27వ సంవత్సరానికి సంబంధించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా వీర కృష్ణయ్య, ఉపాధ్యక్షునిగా సుబ్బరాయుడు, వీరభద్రుడు, అధ్యక్షునిగా నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వీరారెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా అంకిరెడ్డి, మహిళా కార్యదర్శిగా సుధాదేవి తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

## కరెంటు మోటార్ కేబుల్ వైర్లు దొంగతనం

**సుండుపల్లి, మే 07, ప్రభాతవార్త :**
మండల పరిధిలోని కంచిపాటి వాండ్ల పల్లెకు చెందిన రైతులు సుబ్బరాజు చెంగల్ రాజు రెడ్డి రాజు ఇలా దాదాపుగా 8 మంది రైతులు కరెంటు బోరు కేబుల్ వైర్లు దొంగలించడం జరిగిందని సదర వ్యక్తులు వాపోయారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కష్టనష్టాల కు ఓర్చి పొలంలోని పంటలు పండించుకునే దానికి బోర్లు వేసుకున్నామని సదర బోర్లకు సంబంధించి నటువంటి కేబుల్ వైర్లను దుండగులు దొంగలించారని ఆవేదన వ్యక్తం చేశారు.



## టీసీసీ చర్చి ప్రారంభించిన ఎంపీ

**ఘన స్వాగతం మధ్య ప్రారంభోత్సవం**

**ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ**

**పులివెందుల, జూన్ 7, ప్రభాతవార్త :**
నియోజక వర్గ పరిధిలోని తొండూరు మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన టీసీసీ చర్చిని కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎంపీకి స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు డప్పుల వాయిద్యాలు, బాణసంచా, పూలమాలలు, శాలువాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అవినాష్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి చర్చిని ప్రారంభించారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్లు ఆయన పేరున ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఎంపీ, నూతన చర్చి ప్రారంభం గ్రామానికి శుభపరిణామమని పేర్కొంటూ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శశికాంత్ రెడ్డి, అధికార ప్రతినిధి యాడికి దశరథ రామిరెడ్డి, అంకిరెడ్డి సురేష్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొప్పల శివశంకర్ రెడ్డి, యువజన విభాగ కార్యనిర్వాహక సభ్యుడు ఎస్. లక్ష్మిరెడ్డి తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**కలసపాడు, జూన్ 7 ప్రభాతవార్త:**
బద్వేల్ నియోజకవర్గం, కలసపాడు మండలం, శంఖవరం గ్రామంలో సీతారామ లక్ష్మణ సమేత శ్రీ రామచంద్ర స్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయ ధ్వజస్తంభం, కళశం, పోలేరమ్మ, పోతురాజు స్వామి వారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో నిర్వహించబడి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి.కలసపాడు మండల వైసిపి యువ నాయకులు దేశం చరణ్ రెడ్డి , గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు వైసిపి కడప జిల్లా పార్లమెంట్ సభ్యులు, మన ప్రియతమ నాయకులు అవినాష్ రెడ్డి, బద్వే ల్ నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ దాసరి సుధా, బద్వేల్ నియోజకవర్గ వైసిపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ్ రెడ్డి, అలాగే నియోజకవర్గ స్థాయికి చెందిన పలువురు వైసిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సం దర్భంగా దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో తీర్థ ప్ర సాదములు స్వీకరించారు.

## మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ



**కలసపాడు, జూన్ 7 ప్రభాతవార్త:**
మండలంలోని ఆర్‌సిఎం చర్చి ఆవరణలో విచారణ గురువులు కొత్తపల్లి మనోహర్ ఆధ్వర్యంలో గత మూడు నెలలుగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణ కార్యక్రమం అనంతరం మహిళలకు కడప డయాసిస్ బిషప్ సగినాల పాల్ ప్రకాష్ చేతుల మీదుగా మహిళలకు ఆదివారం కుట్టు మిషన్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని తలంపుచే ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇందుకు సహకరించిన విచారణ గురువులు మహిళలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విచారణ కతోలిక క్రైస్తవులు పీసీసీ నెంబర్లు ఉపదేశులు పాల్గొన్నారు.

## నాగార్పమ్మను దర్శించుకున్న మాజీ జెడ్పిటిసి

**సుండుపల్లి, జూన్ 07, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని పెద్దినేని కాల్వ గ్రామం బండ కాడ ఈడిగ పల్లె దగ్గర వెలసిన శ్రీ నాగరత్నమ్మవారిని మాజీ జెడ్పిటిసి ఎర్రపురెడ్డి. జయమ్మ ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు అనంతరం నాగరపమ్మ తల్లికి పసుపు కుంకుమలతో అర్చన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాల నుండి నాగార్పమ్మా జాతర అంగరంగ వైభవంగా జరుగుతుందని భక్తులెల్లరు వచ్చి అమ్మవారికి మ్రొక్కుబడులు తీర్చుకుంటారని అందరి కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నాగర్పమ్మ వెలశారని తెలియజేశారు. ఈమె వెంట మాజీ మండల అధ్యక్షురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు




వార్త దినపత్రికకు వార్షికోత్సవ శుభాకాంక్షలు
30 YEARS ANNIVERSARY
రెండు తెలుగు రాష్ట్రాల్లో చెరగని ముద్ర వేసుకున్న జాతీయ దినపత్రిక వార్తకు వార్షికోత్సవం సందర్భంగా యాజమాన్యానికి, విలేకరులకు, సిబ్బందికి శుభాకాంక్షలు
రాజుపాళెం మండల సమాఖ్య, గ్రామ మహిళా సంఘాలు, వి.ఎ.ఓ.లు మరియు కార్యాలయ సిబ్బంది
వెలుగు కార్యాలయం, రాజుపాళెం (మండలం), వైఎస్ఆర్ కడప జిల్లా.
సుజాత
A.P.M.,
రాజుపాళెం మండల సమాఖ్య

'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
30 YEARS ANNIVERSARY
ఆర్. హుశేన్ రెడ్డి
రెవిన్యూ ఇన్‌స్పెక్టర్
మస్తాన్ వల్లీ
సీనియర్ అసిస్టెంట్
తహశీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, మరియు గ్రామ రెవిన్యూ అధికారులు, సర్వేయర్లు
వై. హరినాథ్ రెడ్డి
తహశీల్దార్
జె. మనోహర్ రెడ్డి
డిప్యూటీ తహశీల్దార్
రాజుపాళెం మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.

వార్త దినపత్రికకు వార్షికోత్సవ శుభాకాంక్షలు
30 YEARS ANNIVERSARY
పంచాయతీ కార్యదర్శులు
ఎస్.ఫణీంద్ర
ఎస్. సుబ్బనారాయణ రెడ్డి
జి. సురేష్ రెడ్డి, కె. వెంకటయ్య
లక్ష్మీతులసి, శ్రావణి,
ఎ.నారాయణ రెడ్డి,
వినయ్, ఎస్. సాయిప్రసన్న
జి.సురేష్‌బాబు
ఎంపిడిఓ
బి.షాకీర్ ఆలీఖాన్
డిప్యూటీ ఎంపిడిఓ
మండల పరిషత్ కార్యాలయ అధికారులు, మరియు సిబ్బంది, రాజుపాళెం మండలం.

'వార్త'కు 30వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
'వార్త' జాతీయ దినపత్రిక వార్షికోత్సవ శుభ సందర్భంగా యాజమాన్యానికి, సిబ్బందికి, పత్రికా విలేకరులకు శుభాకాంక్షలు
30 YEARS ANNIVERSARY
కల్లుట్ల మౌలాలి
టిడిపి మండల కార్యదర్శి,
వెలవలి గ్రామం, రాజుపాళెం (మం)